శివపార్వతులు కల్యాణానికి శైవక్షేత్రాల ముస్తాబు

జిల్లాలో మహాశివరాత్రి ప్రత్యేక పూజల కోసం వైభవంగా ఏర్పాట్లు



తేగడ శ్రీభద్రకాళీ వీరభద్రస్వామివారి ఆలయం

జూలూరుపాడు: శివరాత్రికి ముస్తాబైన శివాలయం

జూలూరుపాడు/ చర్ల/ చుంచుపల్లి/ పాల్వంచ రూరల్/ భద్రాచలం, ఫిబ్రవరి 25: శివపార్వతుల కల్యాణం కోసం భద్రాద్రి జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ ముస్తాబయ్యాయి. బుధవారం జరుగనున్న శివరాత్రి ప్రత్యేక పూజల కోసం ప్రముఖ ఆలయాల బాధ్యులు వైభవంగా ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా వారి సౌకర్యార్థం అన్నీ ఏర్పాట్లూ పూర్తిచేశారు. జూలూరుపాడు మండలం పాపకొల్లులోని కాకతీయుల కాలం నాటి అతి పురాతన చరిత్ర కలిగి స్వయంభుగా కొలువుదీరిన శ్రీఉమా సోమ లింగేశ్వరస్వామి ఆలయం, చర్ల మండలంలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, శ్రీభద్రకాళీ వీరభద్రస్వామి ఆలయం, లింగాల శివాలయం, చుంచుపల్లి మండలం రుద్రంపూర్ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలోని శివాలయం, పాల్వంచ మండలం పెద్దమ్మతల్లి ఆలయ ప్రాంగణంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం తదితర దేవాలయాలు సర్వాంగసుందరంగా దర్శనమిస్తున్నాయి. కాగా, పాల్వంచ పెద్దమ్మగుడిలో మహాశివరాత్రి మహోత్సవాలు మంగళవారమే ప్రారంభమయ్యాయి. అలాగే, ఐటీడీఏ పరిధిలోని ఉద్యోగులకు, ప్రజలకు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఒక ప్రకటనలో మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

'8న ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషిచేయండి'

మాట్లాడుతున్న జడ్జి భానుమతి

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 25: జిల్లా కోర్టు ఆవరణలో మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారం కోసం కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి భానుమతి సూచించారు. జిల్లా కోర్టులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బీమా కంపెనీల ప్రతినిధులు తమ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని సూచించారు. మోటార్ వాహన ప్రమాద బాధితుల కేసుల్లో కక్షిదారులకు న్యాయం చేయాలని కోరారు. లోక్ అదాలత్‌లో రాజీపడడం వల్ల కక్షిదారులకు విలువైన సమయం ఆదా అవుతుందని, డబ్బు వృథా కాదని అన్నారు. కొత్తగూడెం మొదటి అదనపు సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు నీరజ, సుచరిత, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, నిరంజన్‌రావు, ఇన్సూరెన్స్ కంపెనీల న్యాయవాదులు గాదె రామచంద్రరెడ్డి, రావి విజయ్‌కుమార్, రాంప్రసాద రావు, నాగిరెడ్డి, అంబటి రమేశ్, రాజమల్లు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న మెచ్చా

దమ్మపేట, ఫిబ్రవరి 25: మండలంలోని దిబ్బగూడెంలో గ్రామ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆటను కొద్దిసేపు వీక్షించారు.

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఫిబ్రవరి 25: భద్రాచలం సీతారామచంద్ర స్వామికి దేవస్థానంలోని బేడా మండపంలో అర్చకులు మంగళవారం నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కల్పనాచౌదరి

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 25: కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కొల్లి కల్పనాచౌదరి ఆధ్వర్యంలో మండలంలోని రేగళ్ల గ్రామంలో అధునాతన యంత్రాలతో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. మహిళల పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, ఆర్థికంగా బలోపేతం కావాలని, సాధికారత దిశగా అడుగులు వేయాలని సూచించారు. జిల్లా కో ఆర్డినేటర్ రూప్లా నాయక్, మూడ్ సురేశ్, బొబ్బెల రమేశ్, భూక్యా కిషన్, కొల్లి ఫౌండేషన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జామాయిల్ రైతుకు పురస్కారం

ప్రశంసాపత్రం అందుకుంటున్న సుధాకర్‌రెడ్డి

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 25: మండలంలోని తూరుబాక గ్రామ రైతు మందపాటి సుధాకర్‌రెడ్డి.. జామాయిల్ సాగులో అత్యధిక ఉత్పాదకత సాధించారు. ఇందుకుగాను ఆయనను అభినందిస్తూ ప్రోత్సాహక పురస్కారాన్ని, సర్టిఫికెట్‌ను ఐటీసీ డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పొన్నూరు రాజేష్ మంగళవారం ఐటీసీ పీఎస్‌పీడీలో జరిగిన రైతు సదస్సులో అందించారు.

డ్రైవర్లకు ఆర్టీసీ ఆహ్వానం

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 25: ఆర్టీసీ మణుగూరు డిపోలో డిపార్ట్‌మెంట్ బస్సులు నడిపేందుకు డ్రైవర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 19 మంది కావాలని, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో తీసుకుంటామని పేర్కొన్నారు. నెలసరి వేతనం రూ.21వేలు ఉంటుందని, ప్రతి ట్రిప్పుకు మామూలు వంద రూపాయలు ఇస్తామని, రోజుకు ఎనిమిది గంటల డ్యూటీ ఉంటుందని వివరించారు. నెలకు 26 మస్టర్లు చేయాలని, నాలుగు రోజులు సెలవు ఉంటుందని తెలిపారు. హెవీ ట్రాన్స్‌పోర్ట్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకుని కనీసం మూడేళ్లు పూర్తయి ఉండాలని, ఎత్తు 160 సెంటీ మీటర్లు ఉండాలని వివరించారు. ఆర్టీసీ ఖమ్మం ఆర్ఎం ఆఫీస్‌లో ఎంపిక ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారికి 15 రోజులపాటు ఆర్టీసీ వారే శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతితో పాటు రూ.200 మామూలు ఇస్తారని వివరించారు. మరింత సమాచారానికి 8125432301, 9391887069 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

ఎమ్మెల్సీ ఓటు హక్కుదారులకు 27న సెలవు

నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, ఫిబ్రవరి 25 : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 27వ తేదీన వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగి ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ నెల 27న ప్రత్యేక సాధారణ సెలవును మంజూరు చేస్తున్నట్లు నల్లగొండ కలెక్టర్, ఎన్నికల ఆర్వో ఇలా త్రిపాఠి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఎంజీయూ, డీఐవో, డీఈవోలు ఎన్నికల ఆదేశానుసారం వారి పరిధిలో ఉన్న ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని కలెక్టర్ సూచించారు.

పోలింగ్ నిర్వహిస్తున్న విద్యాసంస్థలకు 27న సెలవు

వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తున్న విద్యాసంస్థలు, కార్యాలయలకు ఈ నెల 27న సెలవు ప్రకటిస్తున్నట్లు ఆర్వో, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ కేంద్రాలు ఉన్న విద్యాసంస్థలు, కార్యాలయ అధిపతులు ఆరోజు సెలవు ప్రకటించాలని ఆమె ఆదేశించారు.

ఫాం పాండ్స్‌పై అవగాహన కల్పించాలి

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చండ్రుగొండ, ఫిబ్రవరి 25: గ్రామాల్లో రైతులు ఫారం ఫాండ్స్ నిర్మించుకునేలా వారికి అవగాహన కల్పించాలని మండల అధికారులను అదనపు కలెక్టర్ విద్యాచందన ఆదేశించారు. మండలంలోని మద్దుకూరు, తిప్పనపల్లి, రావికంపాడు, చండ్రుగొండ గ్రామాల్లో ఆమె మంగళవారం విస్తృతంగా పర్యటించారు. నాటుకోళ్ల పెంపకం షెడ్ నిర్మాణ పనులను, మామిడి తోటను, పశువుల పాక నిర్మాణాన్ని, మునగ తోటను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కింద నాటుకోళ్ల పెంపకం, పశువుల షెడ్లను రైతులు నిర్మించుకోవచ్చని చెప్పారు. అన్ని పంచాయతీల్లో ఐదుకు తగ్గకుండా ఫారం ఫాండ్స్ నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించారు. ఫారం పాండ్స్ నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుగుతాయయన్నారు. ఎంపీడీవో అశోక్, పంచాయతీ సెక్రటరీ శివ పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి

రామవరం, ఫిబ్రవరి 25: జిల్లాస్థాయి రెజ్లింగ్, రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో స్థానిక సెయింట్ జోసెఫ్స్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. ఈ నెల 21న త్రీఇంక్లైన్‌లో జరిగిన జిల్లాస్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో మాస్టర్ హర్షవర్ధన్ స్వర్ణ పతకం, మాస్టర్ అబ్దుల్ అయాన్ రజత పతకం సాధించారు. అదే విధంగా ఈ నెల 23న జరిగిన ఓపెన్ కరాటే పోటీల్లో మాస్టర్ జయదీప్ స్వర్ణ పతకం సాధించాడు. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

పోలింగ్ స్టేషన్ పరిశీలించిన ఓఎస్డీ, ఏఎస్పీ

పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏఎస్పీ, ఓఎస్డీ

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 25: దుమ్ముగూడెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఓఎస్డీ పంకజ్ పరితోష్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్ పాటిల్ మంగళవారం పరిశీలించారు. ఏర్పాట్ల వివరాలను ఎన్నికల అధికారుల నుంచి తెలుసుకున్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత ఉండాలి : కలెక్టర్ జితేష్ వి పాటిల్

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

ములకలపల్లి, ఫిబ్రవరి 25: ప్రభుత్వం చేపట్టిన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. స్థానిక మంగపేట పీహెచ్‌సీ ప్రహరీ నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. స్థానికంగా దొరికే మట్టితో ఇటుకలను తయారు చేయిస్తే స్థానిక కూలీలకు పని దొరుకుతుందన్నారు. ఈ ఇటుకలను ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణం పనుల్లో వినియోగించవచ్చన్నారు. తహసీల్దార్ పుల్లారావు, డీఈ సత్యనారాయణ, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవహారాల్లో మహిళలకు అవగాహన ఉండాలి

మహిళా సాధికారత వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 25: సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యత అవసరమని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలందరూ ఆర్థిక వ్యవహారాల్లో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తద్వారా త్వరితగతిన ఆర్థిక ప్రగతి సాధించవచ్చునని అన్నారు. 'ఆర్థిక అక్షరాస్యత - మహిళా సాధికారత'పై భారతీయ రిజర్వు బ్యాంకు ఆదేశాల మేరకు ఈ నెల 24 నుంచి 28 వరకు నిర్వహించనున్న వారోత్సవాల పోస్టర్‌ను కొత్తగూడెంలో మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్థిక ప్రణాళిక, పొదుపు, ఆర్థిక పరిపుష్టికి బ్యాంకులు అందించే రుణాలు వంటి అంశాలపై గృహిణులు, ఉద్యోగినులు, విద్యార్థినులకు అన్ని బ్యాంకుల అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామిరెడ్డి, ఐడీవోసీ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

తునికాకు కట్టకు రూ.5 ఇవ్వాలి

వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 25: తునికాకు 50 ఆకుల కట్టకు రూ.5 ఇవ్వాలని కోరుతూ ఎఫ్‌డీవోకు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. మోడెం నరికించే పనులను వేగవంతంగా చేపట్టాలన్నారు. నాయకులు బుర్ర వెంకన్న, బోస్, యాకూబ్‌షావలి, ఆవుల కిరణ్, స్వర్ణబాక రామ్మూరి, అజ్మీర బిచ్చ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 25: తునికాకు కట్టకు రూ.5 ఇవ్వాలని కోరుతూ సీపీఐ-ఎంఎల్ (మాస్ లైన్) నాయకులు మంగళవారం తహసీల్, అటవీ కార్యాలయాల్లో సిబ్బందికి వినతిపత్రం ఇచ్చారు. గోకినపల్లి ప్రభాకర్, వాసం బుచ్చిరాజు, బాడిస లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి, ఫిబ్రవరి 25: తునికాకు వేలంపాటలు నిర్వహించి, మోడెం పనులు ప్రారంభించాలని కోరుతూ సీపీఐ-ఎంఎల్ (మాస్‌లైన్), అఖిల భారత ఐక్య రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మంగళవారం తహసీల్దారుకు, ములకలపల్లి ఫారెస్ట్ రేంజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నూపా భాస్కర్, అమర్లపూడి రాము, కల్లూరి కిషోర్, నకిరేకంటి నాగేశ్వరరావు, ఎర్రగొర్ల రామారావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సెవెన్ నంబర్ బజార్‌లో టీబీ వైద్య శిబిరం

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాము

రామవరం, ఫిబ్రవరి 25: వంద రోజుల టీబీ అవగాహన కార్యక్రమంలో భాగంగా రామవరం సెవెన్ నంబర్ బజార్‌లో వైద్యారోగ్య శాఖ అధికారులు టీబీ అవగాహన సదస్సును, హెల్త్ క్యాంపును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాము మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు వస్తున్నా, దగ్గుతోపాటు తేమడ వస్తున్నా, రాత్రిళ్లు చలితో జ్వరం వస్తున్నా, ఆకలి లేకపోయినా, బరువు తగ్గుతున్నా, దగ్గినప్పుడు ఛాతిలో నొప్పి వస్తున్నా జాగ్రత్త పడాలని సూచించారు. వెంటనే వైద్యులను సంప్రదించి మందులు తీసుకోవాలని సూచించారు. టీబీహెచ్‌వీ కృష్ణవేణి, పీహెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీవోబీ సేవలను ఉపయోగించుకోవాలి

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 25: బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) సేవలను సింగరేణి అధికారులు, ఉద్యోగులు ఉపయోగించుకోవాలని ఇల్లెందు ఏరియా జీఎం కృష్ణయ్య కోరారు. ఆయన మంగళవారం వారితో తన కార్యాలయంలో మాట్లాడారు. బ్యాంక్ ఆఫ్ బరోడాలో శాలరీ అకౌంట్ ఉన్న అధికారులకు, ఉద్యోగులకు ప్రమాద బీమా కవరేజ్ పొడిగించారని చెప్పారు. వ్యక్తిగత ప్రమాదంలో మృతిచెందితే రూ.కోటి, డ్యూటీలో మృతిచెందితే రూన.1.25 కోట్లు పరిహారం వస్తుందని చెప్పారు. యాక్సిడెంట్ డెత్ కవర్, జీతం ఖాతాకు లింక్ అయిన రూపే డెబిట్ కార్డుపై కవరేజి రూ.2లక్షల వరకు వర్తిస్తుందని చెప్పారు. ప్రమాదంలో శాశ్వతంగా వికలాంగులైతే రూ.కోటి, తాత్కాలిక వికలాంగులైతే రూ.75 లక్షలు పరిహారం అందుతుందని తెలిపారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/S Shriram Finance Ltd, **KOTHAGUDEM** Branch Rep. by its Branch Manager it is stated that smt. **REKHA RAJINI** W/o. late Srinivasa rao, **Aged : 38**Years, Occ : Govt Employee, **R/o.** H.No. 7-6-104, Medara Basthi, Kothagudem Town and Mandal, Bhadradri Kothagudem District is creating mortgage against her property shown below as security for the proposed trade Loan. If anybody having any objection they can send the objections to me or to my client within **3** days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

PROPERTY TO BE MORTGAGED

Cement Sheets roofed house bearing H.No.7-6-104/1, with a plintharea of 400 Sq.Feet in the house site of an extent of 68.66 Sq.yards, along with electricity service connection 13901-08474 situated at Medara Basthi,Kothagudem Town and Mandal, Bhadradri Kothagudem District, SRO Limts of Kothagudem, bounded by: **EAST :** Municipal Road 12 feet, **WEST:** Municipal Road 12 feet, **NORTH:** Joint wall with house of Mahaboob bi 51'-6", **SOUTH :** House of P.Nagalaxmi.

PALIVELA GANESH BABU
Advocate, Kothagudem, Bhadradri Kothagudem Dist.,Cell:9849246278
Kothagudem Dt :23.02.2025

PUBLIC NOTICE

Under the instructions of my client M/S Shriram Finance Ltd, **KOTHAGUDEM** Branch Rep. by its Branch Manager it is stated that **ADAPA SHASHI KUMAR** S/o. Suryanarayana, **Aged : 25**Years, **R/o.** H.No. 7-7-308/49D, Medara Basthi, Kothagudem Town and Mandal, Bhadradri Kothagudem District is creating mortgage against her property shown below as security for the proposed trade Loan. If anybody having any objection they can send the objections to me or to my client within **3** days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

PROPERTY TO BE MORTGAGED

Acc House with a plinth area of 100 Sq.feet in the house site of anextent of 65 Sq.yards in Sy.No. 142 bearing H.No.7-7-308/49, Medara Basthi, Kothagudem Town and Mandal, Bhadradri Kothagudem District, bounded by: **NORTH :** House of D Swaroopa, **SOUTH :** House of D Saradha, **EAST :** House of V Krishna, **WEST:** Municipality CC Road.

PALIVELA GANESH BABU
Advocate, Kothagudem, Bhadradri Kothagudem Dist.,Cell:9849246278
Kothagudem Dt :23.02.2025

సంక్షిప్తం

సేవాలాల్ జయంత్యుత్సవంలో కలెక్టర్

ములకలపల్లి, ఫిబ్రవరి 25: మండలంలోని పూసుగూడెంలో మంగళవారం సేవాలాల్ జయంతి వేడుక జరిగింది. ముఖ్య అతిథులుగా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, స్పెషల్ ఆఫీసర్ సుమ తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం ఇవ్వాలని ధర్నా

టేకులపల్లి, ఫిబ్రవరి 25: మండలంలో ఇటీవల రెండు రోజులపాటు కురిసిన అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ ఏవో కార్యాలయం ముందు సీపీఐ-ఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. డి ప్రసాద్, కల్తీ వెంకటేశ్వర్లు, భూక్యా హర్జ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల సందర్శన

టేకులపల్లి, ఫిబ్రవరి 25: మండలంలోని రోళ్లపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం సందర్శించారు. తరగతి గదులను పరిశీలించారు. మెనూ అమలుపై విద్యార్థులను ఆరా తీశారు.

సీపీఐ కమిటీ ఎన్నిక

అశ్వారావుపేట, ఫిబ్రవరి 25: సీపీఐ పట్టణ కమిటీని పార్టీ స్థానిక కార్యాలయంలో మంగళవారం జరిగిన మహాసభ ఎన్నుకుంది. కార్యదర్శిగా నూకవరపు విజయ్‌కాంత్, సహాయ కార్యదర్శులుగా జోగి రాజు, సయ్యద్ జాకీర్, జక్కం బలరాం, కోశాధికారిగా చీపుర్ల సత్యవతి, మరో 13 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. జిల్లా నాయకులు సయ్యద్ సలీమ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అవగాహన

అశ్వాపురం, ఫిబ్రవరి 25: టీబీ వ్యాధికి కారణాలు, నివారణపై స్థానిక ఎస్సీ కాలనీలో మంగళవారం అవగాహన సదస్సును హెల్త్ సూపర్‌వైజర్ హేమలత నిర్వహించారు. దగ్గు, దమ్ముతో బాధపడుతున్న వారి నుంచి తెమడ నమూనాలు సేకరించారు. ఎంఎల్‌హెచ్‌పీ షారోన్, ఏఎన్ఎంలు భిక్షమమ్మ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కూలర్లు

భద్రాచలం, ఫిబ్రవరి 25: భద్రాచలంలోని శాఖ గ్రంథాలయానికి రెండు కూలర్లను కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, హరిత మిత్ర లయన్ డాక్టర్ గోళ్ల భూపతిరావు మంగళవారం అందజేశారు. వారికి గ్రంథ పాలకుడు జాని కృతజ్ఞతలు తెలిపారు.

గోశాలలో పశు వైద్య శిబిరం

భద్రాచలం, ఫిబ్రవరి 25: స్థానిక సీతారామచంద్రస్వామి దేవస్థానంలోని గోశాలలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని బైఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ వలీబాబా నిర్వహించారు. ఐటీసీ బంగారు భవిష్యత్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ గీత ప్రవళిక, రామాలయం ఏఈవో భవానీరామకృష్ణ, గోశాల ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కరకగూడెం, ఫిబ్రవరి 25: సైబర్ నేరాలు, మత్తు పదార్థాలతో నష్టాలు, కొత్త చట్టాలపై మండలంలోని అనంతారం గ్రామంలో పోలీసులు మంగళవారం అవగాహన కల్పించారు. సైబర్ మోసం జరిగిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయాలని చెప్పారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 25: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం మండల స్థాయి టాలెంట్ టెస్టును ఏఐఎస్ఎఫ్ నిర్వహించింది. జిల్లా మాజీ నాయకుడు దుర్గాల సుధాకర్, నాయకులు వరక అజిత్, పవన్, సాయి, నాగేంద్రబాబు, గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

28న ప్రజాసంఘాల సదస్సు

ఇల్లెందు, ఫిబ్రవరి 25: కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక కేంద్ర బడ్జెట్‌పై ఈ నెల 28న ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సదస్సు ఉంటుందని సీఐటీయూ నాయకుడు ఏజే రమేష్ చెప్పారు. ఆయన మంగళవారం స్థానిక ఏలూరి భవనంలో సీఐటీయూ సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్‌ను సవరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. సదస్సును శ్రేణులు జయప్రదం చేయాలన్నారు. నాయకులు తాళ్లూరి కృష్ణ, అబ్దుల్ నబి తదితరులు పాల్గొన్నారు.

లోడింగ్ పెంచి ఆదుకోవాలని వేడుకోలు

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 25: తమకు లోడింగ్ పెంచి ఆదుకోవాలని సింగరేణి యాజమాన్యానికి లారీల యజమానులు వేడుకున్నారు. వారు మణుగూరులో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీటీపీఎస్‌కు టిప్పర్లు, హెవీ వాటర్ ప్లాంట్‌కు రోప్‌వే, ఇతర విద్యుత్ కేంద్రాలకు వ్యాగన్ల ద్వారా బొగ్గును తరలిస్తున్నందున తమకు లోడింగ్ తగ్గిందని, ఫలితంగా ఆదాయం పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆదుకోవాలని యాజమాన్యాన్ని వేడుకున్నారు.

శిశు గృహను సందర్శించిన మెజిస్ట్రేట్

భద్రాచలం, ఫిబ్రవరి 25: స్థానిక శిశు గృహను ఫస్ట్ క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్, లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ శివనాయక్ మంగళవారం సాయంత్రం సందర్శించారు. అక్కడి పిల్లల ఆలనాపాలన వివరాలను నిర్వాహకుల నుంచి తెలుసుకున్నారు. ఆ తరవాత, సబ్ జైల్ సందర్శించి, ఖైదీలతో మాట్లాడారు.

పేకాట జూదరులు అరెస్ట్

అశ్వారావుపేట, ఫిబ్రవరి 25: పేకాట జూదరులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పట్టణంలోని పేటమాలపల్లి శివారులో పేకాట శిబిరంపై సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పదిమందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.14,440, ఏడు సెల్ ఫోన్లు, తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనపర్చుకున్నారు. కేసును ఎస్సై యయాతి రాజు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

అశ్వారావుపేట, ఫిబ్రవరి 25: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వాటిని తహసీల్దార్ సీజ్ చేశారు. మండలంలోని నారంవారిగూడెం వాగు నుంచి కొందరు వ్యక్తులు దమ్మపేట మండలానికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ సమాచారంతో అక్కడకు ఎస్సై వెళ్లి, అనుమతులు లేని ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు, అక్కడి నుంచి తహసీల్ కార్యాలయానికి అప్పగించారు. ఈ ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ వనం కృష్ణ ప్రసాద్ తెలిపారు.